ఇంటింటికీ తిరిగి సంతకాలు సేకరిస్తున్న గోషామహల్‌వాసులు

ఉస్మానియా దవాఖాన మాదగ్గరొద్దు

- ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సంతకాల సేకరణ

అబిడ్స్, సెప్టెంబర్ 1: గోషామహల్ పోలీస్ స్టేడియంలో ఉస్మానియా దవాఖాన నిర్మాణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వినోద్‌యాదవ్, కోటి శైలేశ్ కురుమ, పశుపతి, వీరేందర్, కిరణ్, వాసుయాదవ్ గోషామహల్ ప్రాంతంలో ఇంటింటికీ తిరిగి సంతకాలు సేకరించారు. దవాఖాన ఏర్పాటు నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకునేంత వరకు ఆందోళన చేపడ్తామని వారు హెచ్చరించారు. దవాఖాన మార్చురీతో దుర్గంధం వ్యాప్తి చెంది ఇక్కడి ప్రజలు అనారోగ్యం పాలయ్యే ప్రమాదముందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యామ్నాయ స్థలం ఎంపిక చేసి నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు.

కుటుంబాన్ని బలిగొన్న బెట్టింగ్

గాజులరామారంలో విషాద ఘటన

కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 1: ఆన్‌లైన్ బెట్టింగ్ ఏకంగా ఓ కుటుంబాన్నే బలితీసుకున్నది. ఈ విషాద ఘటన జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. బాలానగర్ ఏసీపీ హనుమంత్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్న మంచిర్యాల వాసి వెంకటేశ్ (37) తన భార్య వర్షిణి (33)తోపాటు పిల్లలు రిషికాంత్ (11), విహాన్ (3)తో కలిసి గాజులరామారం బాలాజీ లేఅవుట్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో మూడేండ్ల నుంచి అద్దెకు ఉంటున్నాడు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటుపడ్డ వెంకటేశ్.. కొంత కాలం నుంచి తన జీతంతోపాటు తెలిసినవారి నుంచి తెచ్చిన అప్పులను సైతం బెట్టింగ్‌లలో పెట్టి తీవ్రంగా నష్టపోయాడు. దీనిపై భార్యభర్తల మధ్య మనస్పర్థలు తలెత్తడంతో తీవ్ర మనోవేదనకు గురైన వెంకటేశ్.. కుటుంబమంతా చనిపోవాలని నిర్ణయించుకున్నట్టు శనివారం తెల్లవారుజామున తన తండ్రికి మెసేజ్ పంపాడు. అనంతరం భార్యతోపాటు ఇద్దరు పిల్లలను ముఖంపై దిండుతో అదిమిపెట్టి చంపిన వెంకటేశ్.. ఆ తర్వాత తాను కూడా ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఫోన్ ద్వారా వెంకటేశ్ తండ్రి అందించిన సమాచారం మేరకు వాచ్‌మన్ వెళ్లి ఆ అపార్ట్‌మెంట్ తలుపులు కొట్టినా సమాధానం లేకపోవడంతో స్థానికుల సాయంతో పోలీసులకు ఫోన్ చేశారు. వారు వచ్చి బలవంతంగా తలుపులు తెరవడంతో అప్పటికే జరగరానిది జరిగిపోయింది. వేర్వేరు గదుల్లో వెంకటేశ్, ఆయన భార్య, పిల్లలు విగతజీవులై కనిపించడంతో మృతదేహాలను గాంధీ దవాఖానకు తరలించారు. వెంకటేశ్ కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

బాధిత కుటుంబం (ఫైల్‌ఫోటో)

కృషి విజ్ఞాన కేంద్రాల ద్వారా వ్యవసాయ శిక్షణ

- ఐసీఏఆర్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఆర్‌సీ అగర్వాల్

హైదరాబాద్, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ), వ్యవసాయ యూనివర్సిటీ: వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, కృషి విజ్ఞాన కేంద్రాల ద్వారా యువతకు శిక్షణ ఇస్తున్నామని భారత వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (ఎడ్యుకేషన్) డాక్టర్ ఆర్‌సీ అగర్వాల్ తెలిపారు. ఆదివారం రాజేంద్రనగర్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ (నార్మ్) 49వ వ్యవస్థాపక దినోత్సవానికి ముఖ్యఅతిథిగా అగర్వాల్ హాజరై మాట్లాడారు. వ్యవసాయ డిప్లొమా కోర్సులతో విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు, స్వయం ఉపాధి దొరుకుతాయని వ్యవసాయ విశ్వవిద్యాలయం మాజీ వైస్ చాన్సలర్ డాక్టర్ పద్మరాజు చెప్పారు. ఏ-ఐడియా ద్వారా దేశవ్యాప్తంగా 321 స్టార్టప్‌లకు సహకారాన్ని అందిస్తున్నామని నార్మ్ డైరెక్టర్ శ్రీనివాస్‌రావు తెలిపారు. ప్రైవేటు వ్యవసాయ విశ్వవిద్యాలయంతో పాటు 56 ఐసీఏఆర్ ఇనిస్టిట్యూట్‌లతో అవగాహన ఒప్పందాలను కుదుర్చుకుని ముందుకు సాగుతున్నామన్నారు. ఈ సందర్భంగా బెస్ట్ ఇన్నోవేటివ్ రైతులు, స్టార్టప్, ప్రింట్ మీడియా, పీజీ స్టూడెంట్‌లకు అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో నార్మ్ ఇన్‌చార్జి జాయింట్ డైరెక్టర్ రమాసుబ్రహ్మణ్యం, వివేక్ పూర్వర్, జాకీర్‌కిల్జీ పాల్గొన్నారు.

ప్రముఖ పర్యావరణవేత్త కిషన్‌రావు మృతి

- పటాన్‌చెరు కాలుష్యంపై అలుపెరగని పోరాటం

ప్రముఖ పర్యావరణవేత్త డాక్టర్ కిషన్‌రావు (ఫైల్)

పటాన్‌చెరు, సెప్టెంబర్ 1: ప్రముఖ పర్యావరణవేత్త డాక్టర్ అల్లాని కిషన్‌రావు (86) తీవ్ర అనారోగ్యంతో ఆదివారం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం నందిగామలో మరణించారు. 1938లో పటాన్‌చెరు పట్టణ సమీపంలోని మన్మూల్‌లో జన్మించారు. ఎంబీబీఎస్ చదివి 1977లో పటాన్‌చెరులో యశోద దవాఖాన ఏర్పాటు చేశారు. 1980 నుంచి ఏర్పాటు చేసిన పరిశ్రమలు తీవ్రస్థాయిలో కాలుష్యం వదలడంతో ఆయన పోరుబాట పట్టారు. ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చి ధర్నాలు, ఆందోళనలు చేపట్టారు. 1986లో ప్రముఖ పర్యావరణవేత్త పురుషోత్తంరెడ్డి మార్గదర్శకత్వంలో డాక్టర్ కిషన్‌రావు సిటిజన్స్ ఎగెనెస్ట్ పొల్యూషన్ ఫోరంలో చేరారు. పటాన్‌చెరు-బొల్లారం కాలుష్యాన్ని వెలుగులోకి తెచ్చి సుప్రీంకోర్టు వరకు న్యాయపోరాటం చేశారు. ప్రముఖ పర్యావరణవేత్త దివంగత చిదంబరంతో కలిసి ప్రజా ఉద్యమాలను నిర్వహించారు. సుప్రీంకోర్టు, గ్రీన్ ట్రిబ్యునల్ నుంచి కాలుష్య నివారణకు అనేక ఆర్డర్లు తీసుకొచ్చి కాలుష్య పీడిత గ్రామాలకు ఉచితంగా తాగునీరు అందేలా కృషిచేశారు. 'పటాన్‌చెరు ఏ హెల్ ఆన్ ఎర్త్' పుస్తకాన్ని రాసి అంతర్జాతీయ సింపోజియమ్‌లలో పత్రాలను సమర్పించారు. స్వచ్ఛమైన గాలి, పరిశుభ్రమైన నీరు అందజేయాలని పారిశ్రామికవేత్తలతో, ప్రభుత్వాలతో పోరాటం కొనసాగించారు. వృద్ధాప్యం రావడంతో ఆయన నందిగామ గ్రామం కేంద్రంగా గోశాల ఏర్పాటు చేసి గోవులకు సేవలందిస్తూ జీవించారు. ఈ ఏడాది జూలై 5న డాక్టర్ కిషన్‌రావుకు నల్సార్ యూనివర్సిటీ ఎర్త్ ఎన్విరాన్‌మెంట్ నేషనల్ అవార్డును అందజేసింది. అనారోగ్యంతో ఆయన మంచానికే పరిమితం కావడంతో ఆయన సోదరుడు అవార్డును స్వీకరించారు. డాక్టర్ కిషన్‌రావు మృతిపై పర్యావరణవేత్తలు, ప్రకృతి ప్రేమికులు, ప్రజలు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తంచేశారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

డీఎస్పీల ప్రమోషన్లకు రంగం సిద్ధం

- 78మంది పదోన్నతికి ప్రపోజల్

హైదరాబాద్, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ): పోలీసుశాఖలో మరోసారి పదోన్నతులకు రంగం సిద్ధమైంది. ఈసారి 78 మంది డీఎస్పీ స్థాయి(సివిల్) అధికారులకు అడిషనల్ ఎస్పీ(నాన్‌కేడర్)లుగా ప్రమోషన్ ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి. 78 మంది అర్హులైన డీఎస్పీల లిస్టును ఏసీబీ క్లియరెన్స్ కోసం డీజీ సీవీ ఆనంద్‌కు డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ (డీపీసీ) పంపినట్టు తెలిసింది. అర్హులైన డీఎస్పీలకు పదోన్నతులు కల్పించాలని అన్ని కమిషనరేట్లు, ఎస్పీ ఆఫీసులకు డీజీపీ కార్యాలయం లేఖ పంపింది. ఇదే విషయాన్ని మల్టీజోన్ ఐజీలకు, ట్రైనింగ్ డైరెక్టర్‌కు ఫ్యాక్స్ ద్వారా తెలియజేసింది. లిస్టులో జతచేసిన అధికారుల ట్రాక్ రికార్డులు, క్రిమినల్ చర్యలను దృష్టిలో పెట్టుకొని పదోన్నతులపై తుది జాబితాను డీజీపీ కార్యాయాలనికి ఏసీబీ అధికారులు అందజేయనున్నారు.

ముగ్గురు పిల్లలను చంపి తల్లి ఆత్మహత్య

- భర్త తాగుడుతో విసుగుచెంది బలవన్మరణం
- నలుగురి మృతితో ఉలిక్కిపడిన రుద్రారం

ఆంజనేయులు కుటుంబం (ఫైల్)

పటాన్‌చెరు, సెప్టెంబర్ 1: భర్త తాగుడుతో విసుగుచెందిన ఆ ఇల్లాలు.. తన ముగ్గురు పిల్లలకు విషమిచ్చి చంపి తానూ ఆత్మహత్య చేసుకున్నది. ఒకే కుటుంబంలో నలుగురు చనిపోవడంతో ఆ గ్రామంలో తీవ్ర విషాదం నెలకొన్నది. ఈ ఘటన ఆదివారం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం రుద్రారంలో చోటుచేసుకున్నది. సదాశివపేట మండలం ఆత్మకూర్‌కు చెందిన ఆంజనేయులు (35) ఇస్నాపూర్‌లో బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. అతడికి భార్య సువర్ణ (28), జస్వంత్ (5), చిన్మయి (3), చిత్ర (3) పిల్లలు ఉన్నారు. చిన్మయి, చిత్ర కవల పిల్లలు. ఆంజనేయులు మద్యానికి బానిసయ్యాడు. మద్యం తాగొద్దని భార్య చాలా సార్లు వారించడంతో ఇద్దరి మధ్య గొడవలు జరిగాయి. కొంతకాలంగా ఆంజనేయులు ఆరోగ్యం దెబ్బతిన్నది. కుటుంబ కలహాలు పెరిగాయి. మెకానిక్ పని కూడా సరిగ్గా చేయడం లేదు. ఆంజనేయులు రిహాబిలిటేషన్ సెంటర్‌లో చేర్చారు. ఆర్థిక ఇబ్బందులు తీవ్రం కావడంతో విసుగుచెందిన సువర్ణ ముగ్గురు పిల్లలకు ఆదివారం మధ్యాహ్నం విషం ఇచ్చి చంపేసింది. పిల్లలు చనిపోయారని నిర్ధారించుకున్నాక.. తానూ గదిలోకి వెళ్లి ఫ్యానుకు ఉరేసుకున్నది. ఇరుగుపొరుగువారు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. తలుపులు పగులకొట్టి గది లోపలికి వెళ్లి చూసేసరికి తల్లి, ముగ్గురు పిల్లలు విగతజీవులుగా ఉన్నారు. పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐ ప్రవీణ్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు దవాఖానకు తరలించారు.

సీఎంఆర్ఎఫ్ స్కాంలో ఇద్దరి అరెస్టు

- పోలీసుల అదుపులో ఆర్ఎంపీ, ప్రైవేట్ దవాఖాన సూపర్‌వైజర్
- నకిలీ బిల్లులు, రబ్బర్‌స్టాంపులు, కంప్యూటర్లు హార్డ్‌డిస్క్‌లు స్వాధీనం

హైదరాబాద్, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ): నకిలీ బిల్లులు సమర్పించి సీఎంఆర్ఎఫ్ నిధులను స్వాహా చేసిన కేసులో పోలీసులు ఇద్దరిని అరెస్టు చేశారు. వారిలో మిర్యాలగూడలో ఆర్ఎంపీ వైద్యునిగా పని చేస్తున్న గొట్టి గిరి, నవీన మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సూపర్‌వైజర్ లేకిరెడ్డి సైదిరెడ్డి ఉన్నట్టు సీఐడీ డీజీ శిఖాగోయెల్ ఆదివారం వెల్లడించారు. వారి నుంచి పలు నకిలీ మెడికల్ బిల్లులు, రబ్బర్ స్టాంపులు, కంప్యూటర్లు, హార్డ్‌డిస్క్‌లు, ప్రింటర్లు, లెటర్‌హెడ్లను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. నవీన మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌తోపాటు నల్లగొండలోని అమ్మ హాస్పిటల్ పేరుతో నిందితులు 19 నకిలీ బిల్లులతో ప్రభుత్వానికి దరఖాస్తులు పంపి డబ్బులు పొందారని, ఆ బిల్లులను తయారు చేసినవారికి రూ.4 వేల చొప్పున ఇచ్చారని పోలీసులు గుర్తించారు. నిందితులను నల్లగొండలోని స్పెషల్ మొబైల్ కోర్టులో హాజరుపర్చి, రిమాండ్ కోరామని, ఈ కుంభకోణంలో ప్రమేయం ఉన్న ఇతర నిందితుల కోసం ఆరా తీస్తున్నామని శిఖాగోయెల్ తెలిపారు.

హెచ్ఏఎల్ ఎండీగా హెచ్‌సీయూ పూర్వ విద్యార్థి

డాక్టర్ సునీల్

కొండాపూర్, సెప్టెంబర్ 1: గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పూర్వ విద్యార్థి డాక్టర్ డీకే సునీల్ హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమితులైనట్టు వర్సిటీ యాజమాన్యం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. వర్సిటీలోని స్కూల్ ఆఫ్ ఫిజిక్స్ విభాగం సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ ఇన్ ఎలక్ట్రానిక్స్ సైన్స్ అండ్ టెక్నాలజీలో 2019లో ప్రొఫెసర్ సామ్రాట్ ఎల్ సబత్ పర్యవేక్షణలో సునీల్ పీహెచ్‌డీ పూర్తి చేశారు. సునీల్‌కు వర్సిటీ యాజమాన్యం అభినందనలు తెలిపింది.

రాబడి

ఈటీఎఫ్‌లంటే ఏంటో తెలుసా?

- ఈటీఎఫ్‌లు ఈక్విటీ, డెట్, కమోడిటీస్ వంటి వివిధ రకాల సాధనాల కోసం అందుబాటులో ఉంటాయి.
- సాధారణంగా వీటికయ్యే వ్యయభారం తక్కువే. అయితే ఈటీఎఫ్‌ల క్రయవిక్రయాల్లో బ్రోకరేజీ ఫీజులు, ఇతరత్రా ట్రేడింగ్ ఖర్చులు తప్పవు.
- ట్రేడింగ్ జరిగే రోజున ఈటీఎఫ్‌లను నాటి మార్కెట్ ధరల వద్దే కొనవచ్చు.. అమ్మవచ్చు.
- ఒక సూచీ ప్రదర్శనను ప్రతిబింబించడమే ఈ ఈటీఎఫ్‌ల లక్ష్యం.
- మ్యూచువల్ ఫండ్స్‌తో పోల్చితే దేశంలో అందుబాటులో ఉన్న ఈటీఎఫ్‌లు పరిమితం.
- ఆన్‌లైన్ బ్రోకర్లు, సంప్రదాయ బ్రోకర్-డీలర్ల ద్వారా ట్రేడ్ అవుతాయి.
- ఇండివిడ్యువల్స్ తమ రిటైర్మెంట్ ఖాతాల్లోనూ వీటిని కొనవచ్చు.

లాభాల స్వీకరణకు అవకాశం!

దేశీయ స్టాక్ మార్కెట్లు వరుస లాభాల్లో దూసుకుపోతున్నాయి. మదుపరులు కొనుగోళ్ల జోష్‌లో ఉన్నారు. ఫలితంగానే గత వారం సూచీలు ఆల్‌టైమ్ హైల్లో స్థిరపడ్డాయి. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,279.56 పాయింట్లు లేదా 1.57 శాతం ఎగబాకి మునుపెన్నడూ లేనివిధంగా 82,365.77 వద్ద నిలిచింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ సైతం 412.75 పాయింట్లు లేదా 1.66 శాతం ఎగిసి తొలిసారి 25,235.90 దగ్గర ముగిసింది. కాగా, మార్కెట్లు నూతన గరిష్ఠాల వద్ద ఉండటంతో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణ దిశగా అడుగులు వేసే వీలుందని మెజారిటీ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దీంతో ఈ వారం కరెక్షన్‌కు అవకాశాలు లేకపోలేదని అంటున్నారు. ఇక గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ పరిణామాలు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఈ వారం కూడా భారతీయ స్టాక్ మార్కెట్ల తీరును నిర్దేశించనున్నాయి. కాగా, అమ్మకాల ఒత్తిడి ఎదురైతే నిఫ్టీకి 24,850 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 24,600 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం 25,500-25,700 మధ్యకు నిఫ్టీ వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

చివరగా..

స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.

ఇలా.. ప్లాన్ చేసుకోండి

సీనియర్ సిటిజన్ల పెట్టుబడికున్న 10 అత్యుత్తమ మార్గాలివే

ఆర్థిక ప్రణాళికలో పొదుపు, పెట్టుబడులకు అత్యంత ప్రాధాన్యత ఉంటుంది. అవగాహన, వివేకంతో ముందుకెళ్తే ఆకర్షణీయ స్థాయిలో రాబడులను పొందవచ్చు. ఇక సాధారణ సిటిజన్స్‌తో చూస్తే సీనియర్ సిటిజన్ల పెట్టుబడులకున్న 10 అత్యుత్తమ మార్గాలను ఒక్కసారి పరిశీలిస్తే వాటిలో..

1 **సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీం**

పదవీ విరమణ పొందినవారు ఎక్కువగా ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ల గురించే ఆరా తీస్తూ ఉంటారు. సురక్షిత, స్థిరమైన ఆదాయ వనరును కోరుకుంటారు. అలాంటి వాటిలో సీనియర్ సిటిజన్ సేవింగ్ స్కీం (ఎస్‌సీఎస్ఎస్) ఒకటి. ఇదో కేంద్ర ప్రభుత్వ పథకం. పూర్తిగా రిస్క్ లేని రుణ సాధనం. 60 ఏండ్లు, ఆపై వయసువారి కోసమే తెచ్చారు. ప్రస్తుత వడ్డీరేటు 8.20 శాతం. ప్రతీ 3 నెలలకోసారి సవరిస్తారు. కనీస పెట్టుబడి రూ.1,000, గరిష్ఠం రూ.30 లక్షలు. ఈ స్కీం గరిష్ఠ పరిమితి 5 ఏండ్లు. ఈ పెట్టుబడి మొత్తాలు పన్ను పరిధిలోకి రావు. అయితే వీటిపై పొందే వడ్డీ ఆదాయం వారివారి ఐటీ స్లాబుల ప్రకారం చెల్లించాల్సి ఉంటుంది.

2 **పోస్టాఫీస్ మంత్లీ ఇన్‌కమ్ స్కీం**

తపాలా శాఖ అందించే ఈ స్కీంలో పెట్టుబడుల కుగాను నెలనెలా నిర్ణీత స్థాయిలో వడ్డీ ఆదాయాన్ని పొందవచ్చు. రిటైర్మెంట్ వయసులో ఆర్థిక భద్రతకు చక్కని అవకాశం. అయితే సీనియర్ సిటిజన్లకే కాదు.. 10 ఏండ్లు దాటిన భారతీయ పౌరులెవరైనా ఇందులో పెట్టుబడులకు దిగవచ్చు. దీని వార్షిక వడ్డీరేటు 7.40 శాతంగా ఉన్నది. ప్రతీ 3 నెలలకోసారి మారడానికి ఆస్కారం ఉన్నది. కనీస పెట్టుబడి రూ.1,500. గరిష్ఠ పెట్టుబడి రూ.4.5 లక్షలు. జాయింట్ అకౌంట్‌లో రూ.9 లక్షలదాకా పెట్టుబడులు పెట్టవచ్చు. కాలపరిమితి 5 ఏండ్లు. ఆ తర్వాత మరో 5 ఏండ్లు కూడా పొడిగించుకోవచ్చు. వడ్డీ ఆదాయంపై పన్నులుంటాయి.

3

ఫిక్స్‌డ్ డిపాజిట్లు

రెగ్యులర్ ఫిక్స్‌డ్ డిపాజిట్లే (ఎఫ్‌డీ) ఇవి. బ్యాంకుల్లో సాధారణ పౌరులతో పోల్చితే సీనియర్ సిటిజన్లకు ఆయా కాలపరిమితుల ఎఫ్‌డీలపై వడ్డీరేట్లు ఎక్కువగా లభిస్తాయి. ఆదాయ పన్ను (ఐటీ) చట్టంలోని సెక్షన్ 80సీ కింద ఎఫ్‌డీలలో పెట్టుబడులకు పన్ను మినహాయింపున్నది. ఏటా రూ.1.5 లక్షలదాకా పన్ను ఆదా చేసుకోవచ్చు. అలాగే నెలవారీగా, 3 నెలలవారీగా, వార్షిక ప్రాతిపదికన నగదునూ పొందవచ్చు. మార్కెట్ రిస్కులకు దూరంగా ఉంటూ సురక్షితమైన పెట్టుబడులను, స్థిరమైన ఆదాయాన్ని ఆశించేవారు ఈ ఎఫ్‌డీలను పరిశీలించవచ్చు.

4

సిస్టమ్యాటిక్ డిపాజిట్ ప్లాన్

సిస్టమ్యాటిక్ డిపాజిట్ ప్లాన్‌లో సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్), ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ) ఫీచర్లుంటాయి. ఒకేసారి పెద్ద మొత్తాల్లో డిపాజిట్లకు బదులు చిన్నచిన్న మొత్తాల్లోనూ డిపాజిట్లకు ఇందులో వీలుంటుంది. నెలనెలా మనం చేసే ప్రతీ డిపాజిట్‌ను ఓ ఎఫ్‌డీగానే చూస్తారు. తక్కువలో తక్కువగా రూ.5వేలతో ఈ మంత్లీ డిపాజిట్లను ప్రారంభించవచ్చు. ఇక ఇందులో రెండు వేరియంట్లుంటాయి. ఒకటి సింగిల్ మెచ్యూరిటీ స్కీం, మరొకటి మంత్లీ మెచ్యూరిటీ స్కీం. వార్షిక వడ్డీరేట్లు 8.50 శాతందాకా ఉన్నాయి. ఏడాది నుంచి ఐదేండ్ల కాలపరిమితితో పెట్టుబడులు పెట్టవచ్చు.

5 **నేషనల్ పెన్షన్ సిస్టమ్**

నేషనల్ పెన్షన్ సిస్టమ్ అనేది కేంద్ర ప్రభుత్వం అందించే రిటైర్మెంట్ సేవింగ్స్ స్కీం. పదవీ విరమణ కాలంలో స్థిరమైన ఆదాయ వనరుగా ఉంటుంది. సంఘటిత, అసంఘటిత రంగాల్లోని ఉద్యోగులకు ఇది చక్కని పథకమనే చెప్పవచ్చు. ఉద్యోగుల నుంచి, వారి సంస్థల తరపు నుంచి ఇందులోకి నగదు జమవుతుంది. ఐటీ చట్టంలోని సెక్షన్ 80సీ, సెక్షన్ 80సీసీడీ(1బీ) కింద పన్ను ప్రయోజనాలు దక్కుతాయి.

6 

సీనియర్ సిటిజన్ ఎఫ్‌డీ స్కీం

60 ఏండ్లు, ఆపై వయసున్నవారికి రెగ్యులర్ ఇన్‌కమ్‌ను అందించడానికి వచ్చినదే ఈ సీనియర్ సిటిజన్ ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ) స్కీం. బ్యాంకులను బట్టి డిపాజిట్లకున్న కనీస, గరిష్ఠ పరిమితులు ఆధారపడి ఉంటాయి. కాలపరిమితి 7 రోజుల నుంచి 10 ఏండ్లదాకా ఉంటుంది. వార్షిక వడ్డీరేట్లు 9.75 శాతం వరకున్నాయి. అత్యవసర పరిస్థితిలో ఎఫ్‌డీని వెనక్కి తీసుకోవచ్చు. అయితే జరిమానాలను చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఎఫ్‌డీల తనఖాపై రుణాలనూ పొందవచ్చు. మీ డిపాజిట్లపై రుణ మొత్తాలు ఆధారపడి ఉంటాయి. రూ.50వేలదాకా పన్ను మినహాయింపుంటుంది.

7

ట్యాక్స్ ఫ్రీ బాండ్లు

ట్యాక్స్ ఫ్రీ బాండ్లలో పెట్టుబడి పెట్టేవారికి చెల్లించే వడ్డీకి పన్ను మినహాయింపు ఉంటుంది. ప్రభుత్వ రంగ కార్యక్రమాలు, ప్రభుత్వ సంస్థలు, మున్సిపల్ కార్పొరేషన్లు, ఇతర మౌలిక సదుపాయాల సంస్థలు ఈ బాండ్లను ప్రభుత్వం తరపున జారీ చేస్తాయి. కాబట్టి ఇదో భద్రత కలిగిన పెట్టుబడి సాధనం.

8 

ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీం

ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీం (ఈఎల్ఎస్ఎస్) అనేది ఓ ట్యాక్స్-సేవింగ్ మ్యూచువల్ ఫండ్ స్కీం. స్టాక్ మార్కెట్లు లేదా వాటి సంబంధిత సాధనాల్లో పెట్టుబడులను పెట్టడం జరుగుతుంది. అయితే ఇందులో రిస్క్ ఉంటుందన్న విషయం మరువద్దు. అయినప్పటికీ వేచిచూస్తే పెట్టుబడులపై మంచి ఆదాయాన్ని సొంతం చేసుకోవచ్చు. తక్కువ రిస్కుతో ఎక్కువ రాబడులను అందుకోవచ్చు మరి. ఇక ఐటీ చట్టంలోని సెక్షన్ 80సీ కింద ఏటా రూ.1.5 లక్షల దాకా పన్ను ఆదా చేసుకోవచ్చు. అయితే వీటిల్లో లాకిన్ పీరియడ్స్ ఉంటాయి.

9

మ్యూచువల్ ఫండ్స్

మ్యూచువల్ ఫండ్స్‌ల్లో పెట్టుబడులు మార్కెట్ రిస్క్‌లకు లోబడి ఉంటాయి. పెట్టుబడులు పెట్టే ముందే సంబంధిత డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం మంచిది. నిజానికి రిస్క్‌లకు దూరంగా ఉండాలనుకునే మదుపరులకు ఇవి పనికిరావు. ఈక్విటీ, రుణ మార్కెట్లలో మీ సొమ్మును మ్యూచువల్ ఫండ్స్ ఇన్వెస్ట్ చేయడమే ఇందుకు కారణం. అయితే ధైర్యంతో నిర్ణయాలు తీసుకుంటే దీర్ఘకాలంలో ఆకర్షణీయ రాబడులనే అందిస్తాయని చెప్పవచ్చు. కాబట్టి నిపుణుల సలహా మేరకు మీ ఇన్వెస్ట్‌మెంట్ పోర్ట్‌ఫోలియోలో మ్యూచువల్ ఫండ్స్‌కూ కొంత భాగం ఇవ్వవచ్చు. లాభాలపై మూలధన లాభాల పన్నులుంటాయి.

10 **పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్**

సీనియర్ సిటిజన్లకు పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్) కూడా ఆకర్షణీయమైన పెట్టుబడి సాధనాల్లో ఒకటి. ఇదో సురక్షిత పెట్టుబడి మార్గం. పీపీఎఫ్‌ల్లో పెట్టుబడి ఏటా రూ.1.5 లక్షలదాకా పన్ను ఆదాకు అవకాశాన్నిస్తుంది. పీపీఎఫ్ ఖాతా పరిమితి 15 ఏండ్లు.